

పాఠశాలల్లోని పనులను త్వరగా పూర్తి చేయాలి
- పునఃప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తవ్వాలి
- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి
- అనాజీపూర్, రాయపోల్ బడుల సందర్శన

8 లో

ఇంకా 3 రోజులే
పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ షురూ



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెదక్ పార్లమెంటు ఎన్నికల ఫలితాలకు సమయం ఆసన్నమైంది. ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈనెల 4వ తేదీన అంటే మరో మూడు రోజుల్లోనే ఈ నిరీక్షణకు తెరపడనున్నది. హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా తలపడ్డారు. పోలింగ్ సరళి కూడా ఎవరికీ అంతుబట్టకుండా సాగింది. దీంతో మెదక్ ఫలితం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన గురుకులంలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే రెండు రోజులు కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా కార్యాక్రమాన్ని నిర్వహించింది.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే 31

- మెదక్ లోక్‌సభ ఫలితంపై ఉత్కంఠ
- నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాల, గిరిజన గురుకులంలో కౌంటింగ్
- సీసీ కెమెరాలతో గట్టి నిఘా.. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు
- ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ
- ఒక్కో బూత్‌కు మూడు ఈవీఎంలతో ఫలితం ఆలస్యమయ్యే అవకాశం



ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూము వద్ద కేంద్ర బలగాలు

సెగ్మెంట్ల వారీగా పోలైన ఓట్లు, కౌంటింగ్ రౌండ్లు

అసెంబ్లీ	పోలైన ఓట్లు	రౌండ్లు
సిద్దిపేట	1,74,969	20
మెదక్	1,75,409	20
నర్సాపూర్	1,91,315	22
దుబ్బాక	1,64,952	19
గజ్వేల్	2,25,607	22
సంగారెడ్డి	1,79,801	21
పటాన్‌చెరు	2,60,541	23
మొత్తం	13,72,894	147
పోస్టల్ బ్యాలెట్	14,297	2

రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరిగితే ఇందులో నాలుగైదు సెగ్మెంట్లపైనే అందరి దృష్టి నెలకొంది. ఈ నాలుగైదింటిలోనూ మెదక్ లోక్‌సభ సెగ్మెంటు మొదటి వరుసలో ఉంటుంది. ఎందుకంటే గడిచిన ఐదు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులే ఇక్కడ విజయం సాధించడంతో ఆ పార్టీకి ఈ సీటు కంచుకోటగా మారింది. ఈ లోక్‌సభ పరిధిలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరింట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ఇందిరాగాంధీ పోటీచేసి ఘన విజయం సాధించిన రికార్డు సైతం ఈ నియోజకవర్గానికి ఉంది. దీంతో తాజా ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఎవరు గెలిచినా ఆశ్చర్యపోనక్కర్లేదనే స్థాయిలో సర్వత్రా చర్చ కొనసాగుతుంది.

రెండు కౌంటింగ్ కేంద్రాల్లో నిఘా

మెదక్ లోక్‌సభ పరిధిలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో ఓట్లను లెక్కించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ రెండుచోట్లా భారీ బందోబస్తును ఏర్పాటు చేయడమేగాకుండా అడుగడుగునా సీసీ కెమెరాలను అమర్చారు. 199 సీసీ కెమెరాలతో కౌంటింగ్ గట్టి నిఘా ఉంచగా, ఎప్పటికప్పుడు పరిశీలించేలా కంట్రోల్ రూమ్‌ను సైతం సిద్ధం చేశారు. మే 13వ తేదీన ఎన్నికలు జరగగా అదే రోజు అర్ధరాత్రి సమయంలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూముల్లోకి తరలించారు. నాటి నుంచి ప్రత్యేక బలగాలను మోహరించి పహారా కాస్తున్నారు. కౌంటింగ్ రోజున ప్రత్యేక పాసులు ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా మూడంచెల పోలీసు బందోబస్తును నిర్వహించనున్నారు.

ఆలస్యంగానే ఫలితం..

మెదక్ లోక్‌సభ పరిధిలో 13,72,894 ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈ ఓట్లను లెక్కించనున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు. 14,297 పోస్టల్ బ్యాలెట్లు పోలవ్వగా వీటి కౌంటింగ్ కోసం 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 102 మంది రెండు రౌండ్లలో ఈ ఓట్లన్ని లెక్కిస్తారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంచి 9 గంటల తర్వాత తొలి ఫలితం వెల్లడించనున్నారు. ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపే కావడం వల్ల అరగంటకు ఒక రౌండ్ పూర్తయ్యే అవకాశం ఉంటుంది. మెదక్ బరిలో 44 మంది అభ్యర్థులు నిలవడంతో ఒక్కో పోలింగ్ బూత్‌లో 3 ఈవీఎంలను వినియోగించారు. లోక్‌సభ పరిధిలోని 2,124 పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన 6,372 ఈవీఎంలను లెక్కించాల్సి ఉంటుంది. మిగతా లోక్‌సభ నియోజకవర్గాలతో పోల్చితే మెదక్ ఫలితం తీవ్ర జాప్యం జరుగుతుందనే అంచనా నెలకొన్నది. సాయంత్రం వరకు తుది ఫలితం కోసం ఎదురుచూడక తప్పదు. ముందుగా దుబ్బాక ఓట్ల లెక్కింపు పూర్తవుతుండగా చివరగా పటాన్‌చెరు ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఈవీఎంలకు సంబంధించి 103 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కోసం 564 మంది సిబ్బందిని కేటాయించారు. మే 27, 30 తేదీల్లో రెండు విడతలుగా ఈవీఎంల లెక్కింపుపై శిక్షణనిచ్చారు. 3వ తేదీన మరోసారి శిక్షణ ఉంటుంది. ఓట్ల లెక్కింపును ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షిస్తున్నారు.





ఈవీఎంల కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణా కార్యక్రమం, అవగాహన కల్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్





నర్సాపూర్‌లోని కౌంటింగ్ కేంద్రాలు
బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో
సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, గజ్వేల్ సెగ్మెంట్లు
గిరిజన గురుకుల విద్యాలయంలో
పటాన్‌చెరు, సంగారెడ్డి

నీటిని విడుదల చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
ఎల్లమ్మచెరువు వద్ద రైతుల ఆందోళన



ఎల్లమ్మ చెరువు తూము వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, రాజకీయ పార్టీల నాయకులు

హుస్నాబాద్, మే 31 : హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులోని నీటిని ఎవరి అనుమతులు లేకుండా విడుదల చేసిన చేపల కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని చెరువు వద్ద రైతులు, వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ చెరువులో చేపలు పట్టేందుకు రాత్రిపూట తూము గేటు ఎత్తి నీటిని బయటకు విడుదల చేస్తున్నాడని, దీంతో చెరువులో నీరు చాలా వరకు తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చెరువులో ఎక్స్‌కవేటర్‌ను పెట్టి పనులు చేయిస్తున్నాడని ఆరోపించారు. చెరువు ఖాళీ అయితే చుట్టుపక్కల వ్యవసాయ బావులు పూర్తిగా ఎండిపోతాయని, పశువులకు తాగడానికి నీరులేక చాలా ఇబ్బంది అవుతుందని తెలిపారు. ముదిరాజ్‌లు చెరువులో చేపలు పట్టడాన్ని తాము తప్పు పట్టడం లేదని, చెరువులో నీరు లేకుండా చేయొద్దని కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని విడుదల చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ బొలిశెట్టి సుధాకర్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కిసాన్ సంఘ్ నాయకులు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, కౌన్సిలర్లు వల్లపు రాజు, అయిలేని శంకర్‌రెడ్డి, పున్న సది, బత్తుల శంకర్‌బాబు, మెతుకు కొమురయ్య, రాములు, లక్ష్మణ్, దేవదాసు, సమ్మయ్య తదితరులున్నారు. కాగా చెరువు చివరన ముళ్ల చెట్లను తొలగించేందుకు కొద్ది పాటిని నీటిని విడుదల చేసినట్లు ముదిరాజ్ సంఘ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు

నిలిచిన ప్రజ్ఞాపూర్ బస్టాండ్ పనులను ప్రారంభిస్తాం
మెదక్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం

గజ్వేల్, మే 31: ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో నిలిచిపోయిన బస్టాండ్ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తామని మెదక్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం తెలిపారు. శుక్రవారం ఆయన బస్టాండ్‌ను పరిశీలించారు. అంతకు ముందు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. డిపోలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం

కమనీయం వేణుగోపాలుడి బ్రహ్మోత్సవం
- వర్గల్‌లో శతఘటాభిషేకంతో ముగిసిన ఏకకుండాత్మక ఉత్సవాలు

7 లో

బడిబాటకు వేళాయే
- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడమే లక్ష్యంగా కార్యాచరణ
- జూన్ 3 నుంచి 19 వరకు కార్యక్రమాలు
- గ్రామ పెద్దలు, అన్ని శాఖల అధికారులు, అమ్మ ఆదర్శ కమిటీల భాగస్వామ్యం

కొండపాక, మే 31 : మళ్లీ బడికి వేళైంది. ఈ నెల 12 నుంచి బడి గంట మోగనుంది. 50 రోజుల వేసవి సెలవులు అనంతరం ఈ నెల 12న పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అంతకు ముందుగానే బడిబాట కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచడమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని 3 నుంచి 19 వరకు నిర్వహించనున్నది. మూడు నుంచి అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, న్యూట్రిషన్, ఉచిత పుస్తకాలు, ఉచిత నోట్ బుక్‌లు, రెండు జతల యూనిఫామ్‌లు, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో గుణాత్మక బోధన అందిస్తున్నారని తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పే ప్రయత్నం చేయనున్నారు.

అన్ని శాఖల భాగస్వామ్యంతో...

ఈసారి బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులే కాకుండా అన్ని శాఖల అధికారులు, అమ్మ ఆదర్శ కమిటీల భాగస్వామ్యం, మహిళా సంఘాల సహకారంతో కార్యక్రమలను నిర్వహించేలా కార్యచరణకు రూపకల్పన చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరచడం కోసం ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఇటీవల ఏర్పాటు చేసింది. వీరి ఆధ్వర్యంలో పాఠశాలల్లో కనీస వసతుల కల్పన కోసం నిధులు మంజూరు చేసి వసతులను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి ఈ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో 976 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో 656 ప్రాథమిక పాఠశాలలు, 113 ప్రాథమికోన్నత పాఠశాలలు, 227 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు తొంబై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

బడిబాట లక్ష్యాలు ఇవీ..

- ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెంచడంతో పాటు గుణాత్మక విద్యనందించటం
- బడీడు పిల్లలను గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటం. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు శాతాన్ని పెంచటం
- 5 నుంచి 7వ తరగతి విద్యార్థులందరినీ ఉన్నత విద్యాలయాల్లో నమోదు చేయించటం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పిల్లలను గుర్తించి సమీప సర్కారు బడుల్లో ప్రవేశాలు కల్పించటం

తేదీల వారీగా కార్యక్రమాలు

- 3న బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహిస్తారు
- 4న పిల్లల ఇళ్లను సందర్శించి జాబితా తయారు చేయడం
- ఐదో తేదీ నుంచి పదో తేదీ వరకు ఇంటింటి ప్రచారం చేసి బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించడం. అంగన్‌వాడీలోని బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించడం
- 11న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి 3వ తేదీ నుంచి 10వతేది వరకు జరిగిన నమోదులపై చర్చించడం
- 12 నుంచి 19వ తేదీ వరకు బడి నిర్వహణతో పాటు ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం
- 12వ తేదీన ప్రజాప్రతినిధుల సమక్షంలో యూనిఫామ్‌లు, నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు
- 13 క్విజ్ నిర్వహించి వివిధ సబ్జెక్టుల చార్ట్‌లను తరగతి గదుల్లో అతికిస్తారు
- 14వ తేదీన ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం, ఉన్నత పాఠశాలలో బాలసభలు
- 15న వికలాంగులను గుర్తించి పాఠశాలల్లో భవిత సెంటర్‌లలో నమోదు చేయించడం. కేజీవీబీ పాఠశాలల్లో బాలికలకు కల్పించే వసతులపై తల్లిదండ్రులకు వివరించడం
- 18న విద్యార్థులతో పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే మొక్కలు నాటించడం. ఆంగ్ల మాధ్యమం గురించి తల్లిదండ్రులకు వివరించడం
- 19వ తేదీన స్పోర్ట్స్‌డేలో భాగంగా వివిధ రకాల ఆటలలో పిల్లలకు పోటీలు నిర్వహిస్తారు






బయట వేడిగాలులు.. ఇంట్లో ఉక్కపోత
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండలు
- సిద్దిపేట జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- డేంజర్ జోన్‌గా ప్రకటించిన వాతావరణ శాఖ
- మెదక్, సంగారెడ్డి జిల్లాలో 43.8 డిగ్రీలు నమోదు

దుబ్బాకలో వడదెబ్బతో యువతి మృతి

మెదక్ అర్బన్/దుబ్బాక, మే 31: భానుడి ప్రతాపంతో ఉమ్మడి మెదక్ జిల్లా నిప్పులకొలిమిలా మారింది. రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో డేంజర్ జోన్‌లో ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. బయటకు వెళితే వేడిగాలులు, ఇంట్లో ఉంటే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి సతమతవుతున్నారు. రాత్రివేళ్లలోనూ వాతావరణంలో ఏ మాత్రం వేడి తగ్గడం లేదు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కట్కూర్‌లో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా రేగోడ్, సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 43.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో ఓ యువతి వడదెబ్బ తాకి మృతిచెందింది. గ్రామానికి చెందిన మల్లీ కల్పన(24) వారం రోజుల నుంచి కొనుగోలు కేంద్రం వద్దనే ఉంటూ, తమ వడ్లను ఎండలో ఆరబెట్టింది. ఎండలోనే ఎక్కువగా ఉండడంతో శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థకు గురైంది. అంబులెన్స్ వాహనంలో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం వేళ అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.



జనసంచారం తక్కువగా ఉన్న సిద్దిపేట బీజేఆర్ చౌరస్తా



లక్మాపూర్‌లో కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట, మే 31: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్త లక్మాపూర్‌లో మాణిక్‌ప్రభు జాతరను పురస్కరించుకొని శుక్రవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల మల్లయోధులతో పాటు పరిసర మండలాల గ్రామాల మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు పోటీల నిర్వాహకులు బహుమతులను అందజేశారు. కుస్తీ పోటీలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఇదిలా ఉండగా మాణిక్ ప్రభు ఆలయంలో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పేద విద్యార్థినులకు చదువు అందించడమే లక్ష్యం

● 9వ తరగతి నుంచి విద్యార్థినులకు ఉచిత విద్యకు ప్రవేశం

● సత్యసాయి ప్రశాంతి నికేతన్ కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమాశంకర్



వివరాలు వెల్లడిస్తున్న కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమాశంకర్

కొండపాక, మే 31: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థినులకు అన్ని వసతులతో కూడిన ఉచిత విద్యను అందించడమే లక్ష్యమని సత్యసాయి ప్రశాంతి నికేతన్ కళాశాల చైర్‌పర్సన్ మహాభాష్యం పూర్ణిమాశంకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొండపాక శివారులో ఆనంద నిలయం ఆవరణలో సత్యసాయి ప్రశాంతి నికేతన్ స్థాపించి ఐదు సంవత్సరాలు పూర్తయిందని, ఆరో సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా యూనివర్సిటీ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 9వ తరగతి నుంచి విద్యార్థినులకు ఉచిత విద్యకు ప్రవేశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాలలో చేరినప్పటి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించి అనంతరం ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే సనాతన ధర్మాలను, ఆధ్యాత్మికతను, సంస్కృతి, సంప్రదాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. చదువుకోలేని పరిస్థితిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులకు చదువు అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. యూనివర్సిటీలో కంప్యూటర్, డ్యాన్స్, ఆర్ట్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఇది మొట్టమొదటి మహిళా ఉచిత యూనివర్సిటీ అని పేర్కొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు రాధిక, జయశ్రీ, శంకర్ తదితరులు మాట్లాడారు. సత్యసాయి సంస్థలో చదువుకొని ఉపాధి పొందుతున్న విద్యార్థులు తమ అనుభవాలను తెలిపారు.

అథ్లెటిక్స్‌లో ఉజ్వల భవిష్యత్తు

● అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న పరమేశ్వర్


సిద్దిపేట టౌన్, మే 31: అథ్లెటిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అథ్లెటిక్స్ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని స్టేడియం మైదానంలో జరిగిన సిద్దిపేట జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను గ్యాదరి పరమేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించి తల్లిదండ్రులకు, శిక్షకులకు జిల్లాకు పేరు తేవాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామిగౌడ్, జిల్లా సైకిల్ సంఘం అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీపీటీఏ జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్, జిల్లా రెజ్లింగ్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కనకయ్య, జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షుడు బయ్యారపు కనకరెడ్డి, శిక్షకులు ప్రభాకర్, కృష్ణకుమార్, నిశాంక్‌గౌడ్, శ్రీకాంత్, సాయికుమార్‌గౌడ్, లీలా, ఆనంద్, బట్టు వేణు పాల్గొన్నారు.











కాలువ పనులు కంచికేనా?

● నిలిచిపోయిన ప్యాకేజీ-18 కాళేశ్వరం పనులు
● రెండు నెలలుగా ముందుకుసాగని వైనం
● పూర్తి చేయకుండానే వెళ్లిపోయిన సిబ్బంది, కూలీలు

నర్సాపూర్, మే 31: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి మెదక్ జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు 18వ ప్యాకేజీ కింద నిర్మిస్తున్న కాలువ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పనిచేసే సిబ్బంది కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోవడంతో కాలువ పనులు ఇక కంచికేనా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. మెదక్ జిల్లా పరిధిలో కాళేశ్వరం కాలువ పనులు తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో ప్రవేశించి నర్సాపూర్ మండలం నాగులపల్లి వరకు కొనసాగుతున్నాయి. అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోకి 19వ ప్యాకేజీ కింద వెళ్తాయి.

731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూ సేకరణ

18వ ప్యాకేజీ కింద నర్సాపూర్ డివిజన్ పరిధిలో శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి, దంతాన్‌పల్లి, నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, మంతూరు, తుజాల్‌పూర్, ఖాజీపేట గ్రామాలు, కౌడిపల్లి మండలం వెంకటాపూర్ గ్రామాల నుంచి 731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూమిని సేకరించి, 2018లో కాళేశ్వరం కాలువ పనులు మొదలు పెట్టారు. పరిహారం విషయంలో అప్పట్లో ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు వ్యక్తం అయినా రైతులకు పట్టాభూమికి ఎకరాకు రూ.7.50లక్షలు, అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.5.50లక్షలు మాత్రమే చెల్లించారు. ఎంతో విలువైన భూములకు పరిహారం చాలా తక్కువగా ఇచ్చారని రైతుల్లో ఆవేదన ఉన్నా నియోజకవర్గంలో కాళేశ్వరం కాలువ వల్ల ఇతరుల భూములకైనా సాగునీరు పుష్కలంగా నిరంతరం అందుతుందన్న సంతోషంలో ఉన్నారు.

44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం

18వ ప్యాకేజీలో సుమారు 44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం చేపడుతున్నారు. అందులో నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో 3.50 కిలోమీటర్ల మేర సొరంగం ద్వారా కాలువ పనులు చేపట్టారు. ప్యాకేజీ పనులపై బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయి దృష్టి సారించకపోవడంతో నత్తనడకన సాగుతూ వచ్చాయి. సిద్దిపేట జిల్లా పరిధిలో కాళేశ్వరం కాలువ పనులు పూర్తి కాగా మెదక్ జిల్లా పరిధిలోని 18వ ప్యాకేజీ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచీ కాళేశ్వరం విషయంలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ పెద్దఎత్తున ఆరోపణలు చేయడం, అధికారంలోకి వస్తే దానిపై విచారణ చేపడుతామని పేర్కొంటూవచ్చారు. కారణమేదైనా మెదక్ జిల్లాలోని 18వ ప్యాకేజీ పనులు రెండు నెలల క్రితం నుంచి జరగడం లేదు. పనులు నిలిపివేయడమే కాకుండా ఇక్కడ పనిచేసే సిబ్బంది, కార్మికులు, కూలీలందరిని పనులు చేపట్టిన సంస్థ పంపించివేసింది. ఈ ప్యాకేజీలో చేపట్టిన కాలువ పనులు దాదాపు పూర్తయి చివరిదశలో ఉండగా సొరంగం ద్వారా తీస్తున్న కాలువ ఇప్పటివరకు 2.50కిలోమీటర్ల మేర పూర్తయి ఇంకా కిలోమీటరు మేర చేపట్టాల్సి ఉంది. ఆ పనులు పూర్తయితే 18వ ప్యాకేజీ పనులు దాదాపు పూర్తయే అవకాశమున్నా పనులు చేపట్టిన సంస్థ ప్రభుత్వం మారిందన్న ఉద్దేశంతోనో లేక మరే కారణమోగానీ పనులు పూర్తి చేయకుండానే వదిలేయడం చర్చనీయంశంగా మారింది. ప్రస్తుతం కేవలం సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఒకరిద్దరు అక్కడ ఉన్న సామగ్రి, ఇతర వస్తువులకు కాపలాగా ఉంటున్నారు.


రెడ్డిపల్లి సమీపంలో సొరంగం ద్వారా చేపట్టిన కాలువ పనులు నిలిచిపోయిన దృశ్యం


మంతూరు, కాజీపేట సమీపంలో ప్యాకేజీ-18కింద నిర్మించిన కాళేశ్వరం కాలువ

మా త్యాగానికి ఫలితం దక్కదా?

కాళేశ్వరం కాలువ పూర్తయితే నర్సాపూర్ నియోజకవర్గంలోని సాగు నీటికి ఇబ్బంది ఉండదని, ఈ కాలువ ద్వారా నియోజకవర్గంలోని చెరువులను నింపి నిరంతరం నీరు ఉండేలా చేస్తామని అప్పటి ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటూ వచ్చారు. ఇప్పుడు కాలువ పూర్తికాకుండానే పనులు నిలిపివేయడంతో భూములు ఇచ్చిన రైతులు భూములు ఇచ్చి త్యాగం చేసినా ఫలితం లేకుండా పోతుందా అనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్యాకేజీ పనులకు ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తిని ఫోన్ ద్వారా సంప్రదించగా తాను కూడా రెండు నెలల క్రితమే వేరే ప్రాజెక్టుకు వెళ్లినట్లు తెలిపారు. పనులు ఆగిపోవడానికి గల కారణాలు తనకు తెలియవని సమాధానమిచ్చారు.

త్వరలోనే పనులు చేపట్టేలా చర్యలు: ఈఈ

ప్రభుత్వం మారినందున నిర్వహణ సంస్థ బిల్లులు వస్తాయో రావో అనే ఉద్దేశంతో ప్రస్తుతం పనులు నిలిపివేసిన మాట వాస్తవమే అని ప్రాజెక్టు ఈఈ రవీందర్ తెలిపారు. త్వరలోనే తిరిగి పనులు చేపట్టి కాళేశ్వరం కాలువను పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. మరీ పనులు తిరిగి ప్రారంభమవుతాయో లేదో వేచి చూడాల్సిందే.

ప్రాణం తీసిన ఆస్తి తగాదా

● వారసత్వంగా రావాల్సిన భూమిని అన్న ఇవ్వకపోవడంతో తమ్ముడి ఆత్మహత్య
● 12 గంటలుగా ఇంట్లోనే వేలాడిన మృతదేహం


స్వామి (ఫైల్)

నిజాంపేట, మే 31: అన్నదమ్ముళ్ల మధ్య ఆస్తి తగాదా ఓ నిండు ప్రాణం తీసింది. వారసత్వంగా రావాల్సిన ఆస్తిని అన్న పంచనందుకు తమ్ముడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం రజాక్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. నిజాంపేట మండలం రజాక్‌పల్లి గ్రామానికి చెందిన చింతాకుల స్వామి(37), తన అన్న గుటయ్యకు మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతున్నది. తండ్రి ఆస్తిని గుటయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోగా.. తనకు రావాల్సిన వాటా ఇవ్వాలంటూ స్వామి పలుమార్లు అన్నను కొన్ని నెలలుగా బ్రతిమిలాడాడు. ఎంతకూ గుటయ్య ఒప్పుకోకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని స్వామి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఉదంతంతో కోపోద్రిక్తులైన కుటుంబీకులు ఆస్తి పంచే వరకు మృతదేహాన్ని తీయబోమంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామస్థులు, పోలీసులు భూ పంపకం విషయంలో సముదాయించే ప్రయత్నంలో ఉన్నారు. పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. దాదాపు 12 గంటల అనంతరం మృతదేహాన్ని కిందకు దించడం గమనార్హం.

వైద్యుల నిర్లక్ష్యంతో మూడురోజుల శిశువు మృతి?

● ఎంసీహెచ్ ఎదుట బంధువుల ఆందోళన


మృతి చెందిన శిశువు

మెదక్ అర్బన్, మే 31: మూడు రోజుల శిశువు మృతిచెందిన సంఘటన మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో శుక్రవారం జరిగింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ మాతా శిశు సంరక్షణ కేంద్రం ఎదుట ధర్నాకు దిగారు. శిశువు తండ్రి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య భవానిని కాన్పు కోసం మెదక్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లగా.. మే 29న సాధారణ కాన్పులో మగ బిడ్డ జన్మించాడు. అనంతరం శిశువుకు జ్వరం వచ్చిందని వైద్య సిబ్బందికి చెప్పినప్పటికీ సకాలంలో చికిత్స అందించలేదన్నారు. శుక్రవారం ఆసుపత్రిని నుంచి డిశ్చార్జ్ చేసే సమయంలో శిశువు మృతి చెందాడని ఆరోపించారు. శిశువు మృతికి వైద్యులు, సిబ్బందే కారణమని ఆరోపించారు. బంధువులతో కలిసి దాదాపు రెండు గంటల పాటు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. పోలీసుల ఆసుప్రతికి చేరుకొని సముదాయించారు. ఫిర్యాదు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ తెలిపారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. తల్లి, బిడ్డను పరీక్షించిన తర్వాత డిశ్చార్జ్ చేసే సమయంలో బాలింత కుటుంబీకులు పాలను చెంచాతో శిశువుకు పట్టడంతో ఊపిరాడక మృతి చెంది ఉండచ్చని తెలిపారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యముంటే ఫిర్యాదు రాసివ్వాలని చెప్పామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

మద్యం మత్తులో దాడి చేసిన నలుగురి రిమాండ్

దుబ్బాక, మే 31: మద్యం మత్తులో ఇద్దరిపై బీరుబాటిళ్లతో దాడి చేసిన నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. శుక్రవారం దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం దుబ్బాక పట్టణానికి చెందిన దేవుని రమణ, పర్శ భాస్కర్, రాచమల్లు వినోద్ అలియాస్ బొమ్మ, ఆలేటి శరత్ మద్యం సేవించి, కారులో లచ్చపేట-దుబ్బాకకు వెళ్తున్నారు. దుబ్బాకలోని గంగమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న విష్ణు, మహమ్మద్ రషాద్ అనే ఇద్దరు ఉన్న కారును అడ్డగించారు. వారిపై బీరు బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో దుబ్బాక ఆసుపత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. రషాద్ భార్యం నస్రీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా పాత కక్షలతోనే దాడి చేసినట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు, హెడ్‌కానిస్టేబుల్ హరిసింగ్, పీసీలు రాంజీ, శ్రీనివాస్, అశోక్, గణేష్ పాల్గొన్నారు.

చంపేస్తామని బెదిరించిన ఇద్దరిపై కేసు

రేగోడు: చంపేస్తామని బెదిరించిన ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం రేగోడు ఎస్ఐ రాజయ్య తెలిపారు. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన సార అశోక్ కారును హైదరాబాద్‌కు చెందిన రవీంద్రకు విక్రయించాడు. రవీంద్ర కారుకు సంబంధించిన ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేదు. ఎందుకని అశోక్ అడిగితే చంపేస్తామంటూ రవీంద్రతో పాటు ఓ మీడియా ఛానల్ రిపోర్టర్ శ్రీకాంత్‌రెడ్డి బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్, మే 31: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాం సమీపంలోగల పట్టాలపై రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడని తెలిపారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. రైల్వేఅధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మూడురోజులపాటు మార్చురీలో భద్రపరుచనున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చేగుంట: నార్సింగి గ్రామ శివారు 44వ జాతీయ రహదారి పక్కన కందకం కుంటలో గుర్తు తెలియని మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నార్సింగి ఎస్ఐ మహ్మద్ మోహినోద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వయస్సు(40) ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పరిశీలిస్తే రెండు మూడు రోజుల క్రితం కుంటలో పడి మృతి చెందినట్లు తెలుస్తోందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిపిన వారు నార్సింగి ఎస్ఐ ఫోన్ నంబర్ 8712657938, లేదా రామాయంపేట సీఐ వెంకటేశ్వర్లు 8712657933ను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసులో ముగ్గురి రిమాండ్

● గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

సిద్దిపేట రూరల్, మే 31: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులకు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.చందన 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిద్దిపేట ఏసీపీ జి.మధు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన హనుమాన్ మాల ధరించిన వ్యక్తులను గుడిలోకి రావద్దన్నందుకు శ్రీకాంత్‌రెడ్డి, భూంరెడ్డి, మహేష్‌గౌడ్‌లపై అట్రాసిటీ కేసు నమోదైంది. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సీతారాంపల్లి గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అద్వర్యంలో పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తున్నారు. గ్రామాన్ని ఎస్సీ సంఘాలకు చెందిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకలలు సందర్శించారు.

రూ.50 వేల విలువ చేసే గంజాయి స్వాధీనం



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 31: బైక్‌పై తరలిస్తున్న రూ.50 వేల విలువ చేసే ఐదున్నర కిలోల ఎండు గంజాయిని మనూరు పోలీసులు పట్టుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు. శుక్రవారం నారాయణఖేడ్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు ఎస్ఐ అంబ్ర్యా శుక్రవారం తన సిబ్బందితో కలిసి మనూరు మండలం ధన్వార్ క్రాస్‌రోడ్స్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు బైక్‌పై బస్తా పెట్టుకొని అనుమానాస్పదంగా వెళ్తుండడంతో, నిలిపి సోదా చేయగా బస్తాలో ఐదున్నర కిలోల ఎండు గంజాయి లభించింది. మెదక్ జిల్లా రేగోడు మండలం దోసపల్లికి చెందిన ఏసయ్యకు గంజాయి సేవించే అలవాటు ఉండడంతో తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను పెంచుకున్నాడని డీఎస్పీ తెలిపారు. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పాలడుగుకు చెందిన విఠల్‌కు ఈ విషయం చెప్పి గంజాయిని విక్రయిస్తే వచ్చిన డబ్బులు పంచుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. దీంతో ఇద్దరు కలిసి కర్ణాటకలోని బీదర్‌లో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తూ ధన్వార్ వద్ద పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ మేరకు గంజాయి, బైక్‌ను సీజ్ చేసి ఏసయ్యను, విఠల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా విఠల్ 2019లోనూ గంజాయి కేసులో అరెస్టయినట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మనూరు ఎస్ఐ అంబ్ర్యా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టండి



సంగారెడ్డిలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

సంగారెడ్డి రూరల్, మే 31: జూన్ 12తో విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన యూటీఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు ముందుగా తాత్కాలిక ఉపాధ్యాయులను (విద్యా వలంటీర్లు) నియమించి అనంతరం డీఎస్సీ ద్వారా కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్‌కు అనుగుణంగా ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్, కోశాధికారి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శులు శామయ్య, నరేష్, సాయితేజ, అరుణశ్రీ, జగన్‌మోహన్, సమియుద్దిన్, చందర్‌రాథోడ్, అనురాధ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు పొజిషన్లు చూపాలి

● జిన్నారం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



మండల సభలో తమకు కేటాయించిన స్థలాలకు పొజిషన్లు చూపాలని ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

జిన్నారం, మే 31: ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిన్నారం మండల పరిషత్ సమావేశం వాడీవేడిగా సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయలేదని, దీంతో బ్యాంకు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ సభ్యులు మండిపడ్డారు. వరికి మద్దతు ధర, రైతుభరోసా, కౌలు రైతులకు సహాయం ఎప్పుడని బీఆర్ఎస్ ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ ప్రశ్నించారు. బ్యాంకులో పంటరుణం తీసుకున్న రైతు రుణం చెల్లించలేదని అతడి భార్యకు డ్వాక్రా లోను ఇవ్వలేదని, దీంతో గ్రూప్ సభ్యుల మధ్య ఘర్షణ జరుగుతందని కాంగ్రెస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ గంగు రమేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సభకు జిన్నారం మంజీర గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను పిలిపించి సమస్యను వివరించారు. వావిలాల పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినా చైర్మన్‌కు తిరిగి బాధ్యతలు ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. జిన్నారంలో హెచ్ఎండీఏ లేఔట్ కోసం అసైన్డ్ భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద ఎకరాకు 600 గజాల చొప్పున స్థలం ఇచ్చినా నేటికీ పొజిషన్లు చూపడం లేదని మండల సభలో సభ్యులు ప్రస్తావించారు. స్థానిక రైతులతో కలిసి ఎంపీటీసీ లావణ్యనరేష్ రైతులకు పొజిషన్లు చూపాలంటూ సభలో వినతిపత్రాన్ని అందజేశారు. మంగంపేటలో 2019లో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన డంప్‌యార్డును ఓ పరిశ్రమ ధ్వంసం చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జడ్పీటీసీ ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు కేటాయించిన ప్రభుత్వ స్థలంలోనే డంప్‌యార్డ్ ఏర్పాటు చేయగా టీఎస్ఐఐసీలో పరిశ్రమ ఏర్పాటు కోసం స్థలం పొందిన యాజమాన్యం డంప్‌యార్డ్‌ను పూర్తిగా ధ్వంసం చేసిందని మండిపడ్డారు. పరిశ్రమ తీరుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పంచాయతీ కార్యదర్శి తెలిపినా రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో కేసు నమోదు కాలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లీనగర్‌లో అక్రమంగా మట్టితవ్వకాలు జరుగుతున్నాయని, విద్యుత్, వ్యవసాయం తదితర సమస్యలపై సభ్యులు మాట్లాడారు.

కమనీయం వేణుగోపాలుడి బ్రహ్మోత్సవం


వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో దేవతామూర్తులకు చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు


వేణుగోపాలస్వామి ఆలయంలో శతఘటాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు

● వర్గల్‌లో శతఘటాభిషేకంతో ముగిసిన ఏక కుండాత్మక ఉత్సవాలు

వర్గల్, మే 31: సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన ఏకకుండాత్మక వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం శతఘటాభిషేకంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ వేద పండితుడు వేదాంతం మురళీధరచారి నేతృత్వంలో దేవతా మూర్తులైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ఏకవింశతి కలశస్నపనంతో పాటు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పుష్కరిణిలో దేవతా మూర్తులకు చక్రస్నానం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో కళశాలు ఏర్పాటు చేసిన దేవతా మూర్తులకు శతఘటాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ధ్వజ అవరోహణ, దేవతా ఉద్వాసన, ద్వాదశరాధన, సప్తావరనం నిర్వహించి ఉత్సవాలను ముగించారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ప్రొద్దటూరి రాజులుగుప్తా, టేకులపల్లి రాంరెడ్డితో పాటు గీతా జ్ఞాన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఎంపీవో


వడ్డెనగూడతండాలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీవో మహేందర్‌రెడ్డి

కంది, మే 31: సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని వడ్డెనగూడతండాలో అక్రమ నిర్మాణాలను ఎంపీవో మహేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వడ్డెనగూడ తండాలో అక్రమ నిర్మాణాలు' కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపీవో మహేందర్‌రెడ్డి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలో అనుమతులు పొందకుండా, హెచ్ఎండీఏ అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలను త్వరలోనే కూల్చివేస్తామని వెల్లడించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చామని, మరో నోటీసు జారీ చేసిన తర్వాత కూల్చివేస్తామని ఆయన పేర్కొన్నారు.

గడ్డపోతారంలో మూడు ముక్కలాట

● పంచాయతీ నుంచి కిష్టయ్యపల్లిని వేరు చేయాలని గడ్డపోతారంవాసుల డిమాండ్
● కలిసే ఉంటామంటున్న కిష్టయ్యపల్లి ప్రజలు
● ప్రత్యేక పంచాయతీ కావాలని అల్లీనగర్‌వాసుల డిమాండ్
● ఒకే పంచాయతీలో విభిన్న డిమాండ్లపై ఆసక్తి

జిన్నారం, మే 31: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ గడ్డపోతారం నుంచి కిష్టయ్యపల్లి గ్రామాన్ని వేరు చేయాలని గత కొన్ని నెలలుగా గడ్డపోతారంవాసులు మండల, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలిసే ఉంటామని కిష్టయ్యపల్లివాసులు కోరుతున్నారు. దీంతో జిల్లా అధికారులు మే 21న గ్రామంలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వాయిదా వేశారు. తాజాగా శుక్రవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో కిష్టయ్యపల్లిని ప్రత్యేక పంచాయతీ చేయాలని గడ్డపోతారంవాసులు వినతిపత్రాన్ని ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందిన గడ్డపోతారంలో స్థానికులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చి నివసిస్తున్న వారితో కలిపి సుమారు 10 వేల జనాభా, 3,850 మంది ఓటర్లు ఉన్నారు. 75 వరకు పరిశ్రమలు ఉండగా ఏటా రూ.3.50 కోట్ల ఆదాయం వస్తుంది. గడ్డపోతారం పంచాయతీ పరిధిలో అల్లీనగర్, చెట్లపోతారం, కిష్టయ్యపల్లి గ్రామాలు ఉండగా.. ఐదేళ్ల క్రితం దాచారం(పునరావాస) గ్రామం కూడా చేరింది. మూడు దశాబ్దాల క్రితం పంచాయతీగా ఉన్న కిష్టయ్యపల్లిని గడ్డపోతారంలో కలిపారని, కిష్టయ్యపల్లి గ్రామాన్ని తమ పంచాయతీ నుంచి వేరు చేయాలనే వాదనలు గతకొంత కాలంగా వినిపిస్తున్నాయి.



గత మూడు దశాబ్దాలుగా కిష్టయ్యపల్లికి చెందిన వారే ఎక్కువసార్లు సర్పంచ్, ఎంపీటీసీగా పని చేశారు. దీంతో తమ గ్రామ అభివృద్ధి, రాజకీయ భవితకు కిష్టయ్యపల్లిని విడదీయడమే ప్రధానమనే భావనలో గడ్డపోతారంవాసులు ఉన్నారు. పరిశ్రమలు, ఇతర ఆర్థిక వనరులు గడ్డపోతారం, అల్లీనగర్ పరిధిలో ఉండడంతో గడ్డపోతారం నుంచి కిష్టయ్యపల్లిని విడదీస్తే అన్ని విధాల నష్టపోతామని ఆ గ్రామ నాయకులు అంటున్నారు. ఇదిలా ఉండగానే శుక్రవారం జరిగిన ఎంపీపీ సమావేశంలో గడ్డపోతారంవాసులు కిష్టయ్యపల్లిని పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ, జడ్పీటీసీ, మండల అధికారులకు వినతిపత్రాన్ని ఇవ్వడంతో మారో మారు ఈ అంశం చర్చనీయాంశమైనది.

ప్రత్యేక పంచాయతీ కోసం అల్లీనగర్‌వాసుల డిమాండ్

గడ్డపోతారం నుంచి కిష్టయ్యల్లిని విడదీయాలని వినతులు కొనసాగుతుండగానే పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌వాసులు తమ గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయతీ చేయాలని అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఇటీవలే ఎంపీడీవోను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్రస్తుత పంచాయతీకి కిలోమీటరు దూరంలో ఉండడం, ఆర్థిక వనరులు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలతో పాటు కొత్త పారిశ్రామిక ప్రాంతం తమ గ్రామ పరిధిలోకి వస్తుండడంతో కొత్త పంచాయతీ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని అల్లీనగర్‌వాసులు అంటున్నారు. ఎన్నికల కోడ్ అనంతరం అధికారులు నిర్వహించే విచారణలో ఏం తేలనుందోనని ఆసక్తి నెలకొన్నది.


శుక్రవారం జరిగిన ఎంపీపీ సమావేశంలో కిష్టయ్యపల్లిని పంచాయతీ చేయాలని వినతిపత్రాన్ని అందజేస్తున్న గడ్డపోతారంవాసులు


అల్లీనగర్‌ను ప్రత్యేక పంచాయతీ చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- రూ.లక్షల వ్యయం.. ఫలితం శూన్యం
- అలంకారప్రాయంగా రైతు వేదికలు
- భూసార పరీక్షల నిర్వహణా కరువు
- కనిపించని అవగాహన సమావేశాలు

బెజ్జంకి, మే 31: వ్యవసాయసాగులో రైతులకు సలహాలు, సూచనలు చేస్తూ, అవగాహన సమావేశాలు నిర్వహించడానికి రైతు వేదికలను నిర్మించారు. వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలుగా మార్చాలన్న సంకల్పంతో లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదికలు నిర్వహణ లేక అలంకారప్రాయంగా మారాయి.



బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్‌లో నిర్మించిన రైతు వేదిక

మండలంలో ఆరు క్లస్టర్లు

మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో గత ప్రభుత్వ హయాంలో రైతుల సౌలభ్యం కోసం గ్రామాలను క్లస్టర్లుగా విభజించి రైతు వేదిక భవనాలను నిర్మించారు. మండల పరిధిలో ఆరు క్లస్టర్ల పరిధిలో బెజ్జంకి, గుండారం, కల్లేపల్లి, దాచారం, గాగిల్లాపూర్, బేగంపేట గ్రామాల్లో ఇరవై నుంచి ఇరవై రెండు లక్షల వ్యయంతో రైతు వేదికలు నిర్మించారు. క్లస్టర్ పరిధిలో ఎంపిక చేసిన రైతు వేదికల్లో శాస్త్రవేత్తల ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించేందుకు వీడియో పరికరాలు ఏర్పాటు చేసి, కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలి. కానీ ఇంతవరకు ఏ ఒక్క రైతు వేదికలో వీడియో ప్రాజెక్టును ఏర్పాటు చేయలేదు.

విడుదల కాని నిధులు

రైతు వేదికల నిర్వహణకు ప్రతి రైతు వేదికలో స్వీపర్‌కు వేతనం, కరెంట్ బిల్లు, రైతు సమావేశాల నిర్వహణ సాధారణ ఖర్చులకు ప్రభుత్వం ప్రతినెల నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ కొద్ది నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో రైతు వేదికల నిర్వహణ సంబంధిత శాఖ అధికారులకు భారంగా మారింది. పలు చోట్ల రైతు వేదికల భవనాలు గ్రామాలకు దూరంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కొన్ని రైతు వేదికల్లోని మరుగుదొడ్లల్లో నీటి సదుపాయం లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి

రైతు వేదికలో నిర్వహించే కార్యక్రమాలు

వ్యవసాయ అధికారులు వారంలో ఒకసారి రైతులతో సమావేశం నిర్వహించి, సమస్యలు తెలుసుకుని సలహాలు సూచనలు ఇవ్వాలి. వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాగు మెళుకువలపై అవగాహన కల్పించాలి. రైతు వేదికలో కంప్యూటర్‌ను ఏర్పాటు చేసి రైతుల సాగు వివరాలు సబ్సిడీలు తదితర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

భూసార పరీక్షలూ కరువు

పంట దిగుబడుల కోసం భూసార పరీక్షలు తప్పనిసరి అని చెబుతున్నప్పటికీ, వాటి నిర్వహణ కరువైంది. రైతు వేదికల్లో భూసార కిట్స్‌ను అందుబాటులో ఉంచి గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించాలి. కానీ రెండు సంవత్సరాలుగా భూసార పరీక్ష కిట్లు లేక నామమాత్రంగా భూసార పరీక్షలు చేస్తూ, జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షల నిర్వహణ కేంద్రానికి వ్యవసాయ విస్తరణ అధికారులు పంపిస్తున్నారు. ఇప్పటికైనా రైతు వేదికలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉపయోగపడేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా..



రైతు వేదిక నిర్మించినప్పటికీ అందుబాటులో లేక నిరుపయోగంగా మారింది. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలను అందుబాటులోకి తీసుకువచ్చి వాటిలో సమావేశాలు నిర్వహిస్తే, పంటల సాగుపై అవగాహన పెరుగుతుంది.

-భగవాన్ రెడ్డి, రైతు, గాగిల్లాపూర్

నిధులు మంజూరు కాలేదు



రైతు వేదికల నిర్వహణకు నిధులను ప్రభుత్వం మంజూరు చేయలేదు. నిధులు విడుదల కాగానే రైతు వేదికల నిర్వహణకు అందిస్తాం. గ్రామాల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పర్యటించి నమోదు చేసుకుంటున్నాం.

-సంతోష్, మండల వ్యవసాయ అధికారి

అదుపుతప్పి కారు బోల్తా

మద్దూరు, మే 31: మద్దూరు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా మరొకరు క్షేమంగా బయటపడ్డారు. మండల కేంద్రంలోని ఓ కారు మెకానిక్ లద్నూరుకు వెళ్లి తిరిగి మద్దూరుకు తన స్నేహితుడితో కారులో వస్తుండగా, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ చేతికి స్వల్ప గాయమైంది. గ్రామస్థులు స్థానిక పీహెచ్‌సీకి తరలించగా సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు

- పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

వర్గల్, మే 31: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మండలంలోని బీఆర్ఎస్ మండల కమిటీ, గ్రామ కమిటీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ఆత్మ కమిటీ డైరక్టర్లు, పీఏసీఎస్ డైరక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నాలని ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో వర్గల్ ఎంపీపీ లతా రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, మండల యూత్ అధ్యక్షుడు లింగ నాగరాజు, వర్గల్ గ్రామ అధ్యక్షుడు కరుణాకర్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు తాళ్ల స్వామిగౌడ్, ఫయాజ్, నాయకులు తదితరులు ఉన్నారు.

'జాగ్రత్తలు తీసుకుంటే ఎండల నుంచి ఉపశమనం'


సమీనా ససుల్తా

మిరుదొడ్డి,మే31: ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ బారి నుంచి బయటపడవచ్చని మిరుదొడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి సమీనా సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె మాట్లాడారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుందని తెలిపారు. వడదెబ్బ తగిలిన వెంటనే స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు.

ఉపాధ్యాయురాలు ఉమారాణికి సన్మానం


ఉమారాణిని సత్కరిస్తున్న సాహితీవేత్తలు

కొండపాక, మే 31 : హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో మండలంలోని మర్పడగ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఉమారాణి ప్రతిభ కనబర్చడంతో ఆమెను సత్కరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళా సమితి, కుసుమధర్మన్న కళా పీఠం, పాలడుగు నాగయ్య కళా పీఠం, లక్ష్యసాధనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి 128వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కవి సమ్మేళనాన్ని హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో మర్పడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు, రచయిత్రి ఇప్ప ఉమారాణి రాసిన కవితకు ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో ఓయూ ఆచార్యులు, ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త కసిరెడ్డి వెంకటరెడ్డి, కుసుమ ధర్మన్న కళా పీఠం అధ్యక్షురాలు రాధాకుసుమ, పాలడుగు నాగయ్య కళా పీఠం అధ్యక్షురాలు, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజిని దేవి, సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు వెంకట కృష్ణారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి, అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి, చంద్రమౌళి, అంజయ్య వేణుకుమార్, దామోదర్‌రావు, వేమూరి రామకృష్ణ, గణేష్, తెలుగు భాషా చైతన్య సమితి, తెలుగుభాష సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్ పాల్గొన్నారు.

ఇంటర్‌నేషనల్ పాఠశాలను ఏర్పాటు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి, మే 31: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ప్రతీ మండలంలో ఇంటర్‌నేషనల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని లింగుపల్లిలో శుక్రవారం డీబీఎఫ్ నాయకులతో కలిసి మాట్లాడారు. గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించడం మంచిదేనని, అంతేకాకుండా పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న మనువాద శక్తులను ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు చంద్రం, శ్రీను, శంకర్ తదితరులున్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్

హుస్నాబాద్, మే 30: చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ సూచించారు. హుస్నాబాద్‌లో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మత్స్య సహకార సంఘాల అవగాహన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్యకారుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేపల పెంపకంలో సంప్రదాయ పద్ధతులకు బదులుగా, ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మత్సకారుల సంఘం అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, నారదాసు ఈశ్వర్, నాయకులు పెండ్యాల అయిలయ్య, గంగాధరి రాజయ్య, ఎడల వనేష్, బైరి రవీందర్, చింతల బాలరాజు తదితరులున్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు మరమ్మతులు

- విద్యుత్ శాఖ సిద్దిపేట ఎస్ఈ మోహన్‌రెడ్డి

సిద్దిపేట టౌన్/నంగునూరు, మే31: ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించడానికి అవసరమైనచోట మరమ్మతులు చేపడుతున్నామని, అందుకు ప్రజలందరూ సహకరించాలని విద్యుత్‌శాఖ సిద్దిపేట జిల్లా ఎస్ఈ మోహన్‌రెడ్డి కోరారు. సిద్దిపేట పట్టణంలోని ఎస్ఈ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం విద్యుత్‌శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని ప్రాంతాలలో స్తంభాలపై ఉన్న విద్యుత్ వైర్లు సాగి ఉన్నాయని, కొన్ని స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉందని అలాంటి వాటిని సరి చేస్తామని, మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. నంగునూరు మండలం పాలమకుల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని సిద్దిపేట టౌన్ ఏడీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పాలమాకుల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'స్వీయ రక్షణకు కరాటే దోహదం'


బహుమతి అందజేస్తున్న ఎస్ఐ రఘుపతి తదితరులు

రాయపోల్, మే 31: కరాటే నేర్చుకుంటే స్వీయరక్షణతో పాటు శారీరక ధారుఢ్యం లభిస్తుందని రాయపోల్ ఎస్ఐ రఘుపతి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిన నర్సింహులు పేర్కొన్నారు. రాయపోల్‌లో జిల్లా యువజన సంక్షేమ, క్రీడల శాఖ సహకారంతో శుక్రవారం నిర్వహించిన కరాటే వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు, క్రీడాకారులకు, విద్యార్థులకు చదువుతోపాటు కరాటే ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా బాలబాలికలు స్వీయం రక్షణ కోసం కరాటే నేర్చుకోవడం అవసరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కరాటే శిక్షణ కోసం ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు నరేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరులో బడిబాటపై నేడు ప్రత్యేక సమావేశం

మద్దూరు, మే 31: నేడు మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌లతో, బడిబాట కార్యక్రమ విజయవంతంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో మాట్లాడారు. జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాలుంటాయని అన్నారు. ఇందుకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బడిబాట లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

'నరేశ్‌చారి మృతి బాధాకరం'

గజ్వేల్, మే 31: బీఆర్ఎస్ కార్యకర్త నరేశ్‌చారి మృతి బాధాకరమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన నరేశ్ చారి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నరేశ్ చారి మృతి బాధాకరమని, ఆయన కుటుంబసభ్యులకు అన్నివిధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు నిజామొద్దీన్ తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బెండ మధు, సీనియర్ నాయకులు మద్ది రాజిరెడ్డి, చాడా శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, అహ్మద్ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మిరుదొడ్డి, మే30: మిరుదొడ్డి గ్రామ పంచాయతీ కార్మికుడు పరుశురాములు తల్లీ మూడు రోజుల క్రితం మృతిచెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోటకమలాకర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామమాజీ సర్పంచు రాములుతో రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భైరయ్య, రాములు, మల్లయ్య, రమేష్, ఐలయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వెల్దుర్తి, మే 31: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన వెల్దుర్తిలో శుక్రవారం చోటు చేసుకున్నది. వెల్దుర్తిలోని ఉప్పల రవికి చెందిన పాడి గేదె మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 50వేలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు. విద్యుత్ శాఖాధికారులు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ వృత్తికే వ్యక్తిత్వానికి కాదు

- సిద్దిపేట సీపీ అనురాధ


క్యాతం లక్ష్మణ్ దంపతులను సన్మానిస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, 31 : ఉద్యోగ విరమణ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్‌లో శుక్రవారం ఎస్ఐ క్యాతం లక్ష్మణ్ ఉద్యోగ విరమణ సందర్భంగా కమిషనర్ కార్యాలయంలో ఆయన్ని సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ క్యాతం లక్ష్మణ్‌న్ను అభినందించి సన్మాన పత్రం, మెమొంటో అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఏసిపి రవీందర్, తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

- ఎంపీడీవో యాదగిరి

జగదేవ్‌పూర్, మే 31: బడీడు పిల్లల్ని బడిలో చేర్పించే విధంగా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. జగదేవ్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొని బడిబయట పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో 90 వేల మొక్కలను నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసవర్మ, మండల విద్యా కోఆర్డినేటర్ యాదవరెడ్డి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభుదాస్

మిరుదొడ్డి, మే 31: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని మిరుదొడ్డి మండల విద్యాధికారి ప్రభుదాస్ పేర్కొన్నారు. మిరుదొడ్డిలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం బడిబాట కార్యక్రమంపై సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 3 నుంచి 19వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్నారరన్నారు. కారయక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎస్ఐ పరుశురాములు, మండల పర్యవేక్షణ అధికారి నారాయణ, సీఆర్‌సీలు తదితరులున్నారు.

యూనిఫామ్‌లను సిద్ధం చేసేందుకు శ్రమిస్తున్న టైలర్లు

మద్దూరు, మే 31: పాఠశాలల పునఃప్రారంభానికి ముందే మద్దూరు ఉమ్మడి మండలంలోని పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక జత యూనిఫామ్‌ను అందించేందుకు టైలర్లు శ్రమిస్తున్నారు. మండలంలోని 20 పాఠశాలల్లోని 2170 మంది విద్యార్థుల కోసం కటింగ్ చేసిన క్లాత్‌ను డీఆర్‌డీవో పీడీ జయదేవ్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక టైలర్లకు చేరవేశారు. కాగా ఇప్పటికే 1268 జతల యూనిఫామ్స్ కుట్టినట్లు ఐకేపీ అధికారులు చెబుతున్నారు. మరో నాలుగు రోజుల్లో 902 జతల యూనిఫామ్స్ అందించేందుకు స్థానిక టైలర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మోడల్‌స్కూల్‌తో పాటు కస్తూర్బా పాఠశాలలను ఇందులోంచి మినహాయించారు.

సంతను యథావిధిగా కొనసాగించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న అందె అశోక్

చేర్యాల, మే 31: చేర్యాలలో ఉన్న పశువుల సంతను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నోయేళ్లుగా సంత నిర్వహిస్తున్న స్థలం కబ్జాకు గురైన నేపథ్యంలో రాజకీయాలకతీతంగా చేసిన పోరాటం ద్వారా కబ్జా చెరవీడినప్పటికీ, పశువుల సంత నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. సమావేశంలో నాయకులు ఈరు భూమయ్య బండారి సిద్దులు, గూడెపు సుదర్శన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్/దౌల్తాబాద్, మే 31: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వెంటనే పూర్తి చేయాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన రాయపోల్ మండలం అనాజీపూర్, రాయపోల్ గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న అమ్మఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట మండల విద్యాధికారి నర్సవ్వ ఉన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి మరమ్మతు పనులను త్వతరగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దౌల్తాబాద్, సూరంపల్లి, దొమ్మాట, దీపాయంపల్లి గ్రామాల్లోని అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బండి నర్సవ్వ, తదితరులు పాల్గొన్నారు.

- **కుకునూరుపల్లి:** పాఠశాలల్లోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చీఫ్ ఇంజనీర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ముద్దాపూర్, రాయవరం, తిప్పారం, మేదినిపూర్ పాఠశాలల్లో ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాల పునఃప్రారంభానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ ఇంజనీర్ మక్బూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య ఉన్నారు.


దూళిమిట్ట ప్రాథమిక పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

- **దూళిమిట్ట:** పాఠశాలల్లో చేపట్టిన పనులను నాలుగు రోజుల్లోగా పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులకు మద్దూర్ ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా దూళిమిట్ట మండల కేంద్రం, లింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో చేపడుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌రెడ్డి, ఎంపీవో ఖాజామొయినుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రాజు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

- ఏడీఏ పద్మ

చిన్నకోడూరు, మే 3: నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పద్మ హెచ్చరించారు. మండలంలోని చిన్నకోడూరు, గంగాపూర్ గ్రామాల్లోని విత్తన విక్రయ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్, ఇన్వాయిస్ బిల్లులను ఆమె పరిశీలించి మాట్లాడారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు రైతులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖాకారి జయంత్‌కుమార్ ఉన్నారు.

- **నారాయణరావుపేట:** కల్తీ విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఉన్న విత్తనాల దుకాణాలను ఏవో వెంకటరమణితో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల్లో రిజిస్టర్లు, బిల్ బుక్‌లను పరిశీలించామన్నారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆమెవెంటఏఎస్ఐ పరమేశ్వరి సిబ్బంది తదితరులు ఉన్నారు.


నారాయణరావుపేట: రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ

అందుబాటులో జీలుగ విత్తనాలు

మర్కుక్, మే 31: రాయితీపై జీలుగ విత్తనాలు లభ్యం అవుతున్నాయని మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని గణేష్‌పల్లిలో జీలుగ విత్తనాలు రాయితీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీలుగ వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుందని, కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు, యువకులు ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు విడ్డూరం

- అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోం
- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్

గజ్వేల్, మే 31: ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కూడా పూర్తి కాకముందే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్ బీఆర్ఎస్ నాయకుడు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గజ్వేల్ పట్టణ అభివృద్ధిని అడ్డుకున్నది హరీశ్‌రావేనని, మంత్రిగా ఉండి గజ్వేల్ ప్రజల సమస్యలను చెబుదామని వెళ్తే కేసీఆర్‌ను కలువనీయలేదన్నారు. ఒక్కరికీ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. సీఎంగా ఉండి గజ్వేల్ ప్రజలకు కేసీఆర్ ఏమీ చేయలేదని, పదేళ్లుగా సీఎంగా ఉన్నా రింగ్ రోడ్డును పూర్తి చేయలేదన్నారు. త్వరలో నర్సారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లు ఉంటుందని, విలేకరుల సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేగా గజ్వేల్‌కు కేసీఆర్ రావాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే గత కౌన్సిల్ సభ్యులమంతా కాంగ్రెస్‌లో చేరామని వెల్లడించారు. ఆయనవెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, రాజ్‌కుమార్, నక్క రాములుగౌడ్, నాయకులు జహీర్, మామిడి కృష్ణ, జంగం రమేశ్‌గౌడ్, రేగొండ, సురేశ్, అజ్గర్, నేత నాగరాజు, కప్పు భాస్కర్, క్యాసారం బాబా, లక్ష్మీనారాయణ ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గాడిపల్లి భాస్కర్

ఆంజనేయస్వామి పల్లకీ సేవ

చేర్యాల, మే 31: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లిలో మాలాధారణ స్వాములు భక్తిప్రపత్తులతో పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయం నుంచి గ్రామంలోని వీధులగుండా రామనామస్మరణతో స్వాములు భజనలుచేశారు. మండల, అర్ధమండల, ఏకాదశ రోజులదీక్షలు చేపట్టిన స్వాములు మాల విరమణ కోసం యాదాద్రి, కొండగట్టు, విజయవాడ, వేములవాడ తదితర క్షేత్రాలకు తరలివెళ్లారు.


చేర్యాల: పల్లకీసేవ నిర్వహిస్తున్న మాలధారులు

- **చిన్నకోడూరు:** మండల కేంద్రంలో హనుమాన్ మాలధారణ స్వాములు గురువారం రాత్రి హనుమాన్ శోభయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు హనుమాన్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ప్రతిష్ఠించి భజనలు, రామనామస్మరణతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు.


చిన్నకోడూరులో హనుమాన్ శోభయాత్ర దృశ్యం

- **మద్దూరు:** మద్దూరు మండల కేంద్రంలో హనుమాన్ మాలధారలుఉ శుక్రవారం భక్తిశ్రకద్ధలతో హన్‌మాన్ యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య అభిషేకాలు చేసి అర్చనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. స్వాములు మాల విరమణకు కొండగట్టు ఆలయానికి తరలివెళ్లారు.